రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- వాహనదారులకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ బీ సత్యప్రసాద్ • పలు శాఖల అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, డిసెంబర్ 30: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో రోడ్ సేఫ్టీపై ఆర్‌అండ్ బీ, రవాణా, ఎన్‌హెచ్ 63, పలు శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని, యాక్సిడెంట్ స్పాట్లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్లపై గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చాలని ఆదేశించారు. అలాగే పట్టణాల్లో స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు బీఎస్ లత, ఎస్పీ అశోక్ కుమార్, ఆర్‌అండ్‌బి అధికారులు, రవాణా, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కూతురే కొడుకై..

- దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంతో తండ్రిమృతి
- పుట్టెడు దుఃఖంలో చితికి నిప్ప • దమ్మన్నపేటలో విషాదం

తండ్రి అంతిమ యాత్రలో కూతురు వర్షిణి

మేడిపల్లి, డిసెంబర్ 30: పొట్ట చేత పట్టుకొని పరాయి దేశం వెళ్లిన తండ్రి, రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, కూతురే కొడుకై అంత్యక్రియలు నిర్వహించిన ఘటన దమ్మన్నపేటలో జరిగింది. గ్రామానికి చెందిన శేరు ఎర్రయ్య అలియాస్ ఎర్రన్న, లక్ష్మి దంపతులకు శిరీషా, వైష్ణవి, వర్షిణి ముగ్గురు కూతుళ్లు. ఎర్రన్న పదేండ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడి దర్వీస్ కంపనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్దిరోజుల క్రితమే పెద్ద కూతురు శిరీషకు వివాహం చేయగా, వైష్ణవి, వర్షిణి చదువుతున్నారు. అయితే ఈ నెల 15న దుబాయ్‌లో అతను ప్రయాణిస్తున్న కంపెనీ బస్సు లోయలో పడిపోగా, అక్కడికక్కడే మృతి చెందాడు. గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు (జీడబ్ల్యూపీసీ) గుండెల్లి నరసింహ, శ్రీధర్ సహకారంతో ఎర్రన్న మృతదేహం ఆదివారం రాత్రి స్వగ్రామానికి చేరుకోగా, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. సోమవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించగా, చిన్న కూతురు వర్షిణి అగ్గి పట్టి చితికి నిప్పుపెట్టడం, చూపరులను కంటతడి పెట్టించింది.

బాధితులకు భరోసా ఇవ్వాలి

- ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి
- ఎస్పీ అశోక్ కుమార్
- జగిత్యాల టౌన్ పోలీస్టేషన్‌లో తనిఖీ

రిసెప్షన్ వద్ద డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 30: పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, న్యాయం జరుగుతుందనే భరోసా ఇవ్వాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. సోమవారం జగిత్యాల టౌన్ పోలీస్ ఠాణాను తనిఖీ చేశారు. పెండింగ్‌లో కేసుల వివరాలు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీసు సిబ్బందితో కాసేపు మాట్లాడారు. పలు అంశాలపై చర్చించారు. పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో డాటా ఎంట్రీని పరిశీలించారు. జనరేట్ చేసిన దరఖాస్తుదారులకు రసీదు అందించాలని సూచించారు. రికార్డ్ రూం, రైటర్ రూంతోపాటు స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు అనుసంధానించిన కంట్రోల్ రూంను సందర్శించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖలో అందుబాటులో ఉన్న అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది వినియోగించుకోవాలని, దీనిపై అవగాహన ఉండాలని సూచించారు. ఇక్కడ డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు కిరణ్‌కుమార్, మన్మదరావు, గీత, మల్లేశం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బతికెపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలి

కలెక్టరేట్ ఎదుట మండల సాధన సమితి నాయకులు

- ప్రజావాణిలో కలెక్టర్‌కు మండల సాధన సమితి ఆధ్వర్యంలో వినతి
- తరలివచ్చిన పలు గ్రామాల ప్రజలు, నాయకులు

జగిత్యాల, డిసెంబర్ 30: పెగడపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ బతికెపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు, నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం బతికెపల్లి మండల సాధనసమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సాధన సమితి నాయకులు మాట్లాడుతూ బతికెపెల్లి పంచాయతీలో సుమారు 8వేల జనాభా ఉందని, అనుబంధ గ్రామాలుగా పుల్లయ్యపల్లి, కొండయ్యపల్లి కొనసాగుతున్నాయని, రెండు ఎంపీటీసీ స్థానాలతో విస్తరించి ఉందని చెప్పారు. పాలన సౌలభ్యం కోసం రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేసేందుకు అనువైన గ్రామమని వివరించారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే ఈ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి అర్ధాంతంగా నిలిపివేసిందని గుర్తుచేశారు. మండలంగా ఏర్పాటు చేస్తే దీని పరిసర గ్రామాలైన మద్దులపల్లి, ఆరవెల్లి, దోమలకుంట, సుద్దపెల్లి, లింగాపూర్, శాలపల్లె గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేయగా, వారు స్పందించారు. విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ప్రభుత్వానికి లేఖ రాస్తామని పేర్కొన్నారని మండల సాధన సమితి నాయకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

జగిత్యాల టవర్ సర్కిల్, డిసెంబర్ 30: సీఎం కప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు తరలివెళ్లారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభచూపి, ఈ నెల 31 నుంచి జనవరి 3 వరకు హైదరాబాదులోని ఎబ్బీ స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా విద్యార్థులు దుగ్యాల రాఘవ్, శ్రీకర్, బాలాజీ, అనీల్, లోకేశ్వరన్, శివకుమార్, ముజిబుల్ హఫీజ్, మోక్షిత, తేజశ్విని, అనిత, స్వరాలి, శ్రీ లక్ష్మీ, కోచ్ నవీన్ తరలివెళ్లినట్లు బాక్సింగ్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పాదం మహేందర్, సెక్రెటరీ గువ్వ శ్రీనివాస్, కోచ్ నవీన్ తెలిపారు.

కారు ఢీకొని ఒకరి మృతి

రాజమల్లయ్య (ఫైల్)

కథలాపూర్, డిసెంబర్ 30: పోతారం గ్రామానికి చెందిన నాగెల్లి రాజమల్లయ్య (55) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగెల్లి రాజమల్లయ్య వ్యక్తిగత పని నిమిత్తం ఆదివారం సాయంత్రం కోరుట్ల పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. దుంపేట శివారులో వెనుక నుంచి కారు రాజమల్లయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా, తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొడుకు కేశవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో జీవిత ఖైది

రాయికల్, డిసెంబరు 30: కుర్మపల్లి గ్రామానికి చెందిన పుల్ల లస్మయ్య (60) జీవిత ఖైదీ అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం స్వగ్రామంలో పోలీస్ పహారా నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో భూతగాదాలు నేపథ్యంలో లస్మయ్య, అతని భార్య గంగవ్వ, కొడుకు మహేశ్ కలిసి ఇద్దరిపై దాడి చేయగా, అందులో ఒకరు చనిపోయారు. ఈ క్రమంలో నేరం రుజువు కావడంతో ఈ ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్ష విధించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ క్రమంలో లస్మయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీంతో పోలీసులు సోమవారం మృతదేహంతో పాటు కొడుకు మహేశ్, భార్య గంగవ్వను స్వగ్రామానికి తరలించారు. బందోబస్సు నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. తిరిగి గంగమ్మ, మహేశ్‌ను జైలుకు తరలించారు.

రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలి

స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న మెట్‌పల్లి డీఎస్పీ రాములు

కోరుట్ల, డిసెంబర్ 30: ఠాణా పరిధిలోని రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని మెట్‌పల్లి డీఎస్పీ రాములు సూచించారు. సోమవారం కోరుట్ల పోలీస్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది ఆర్టికల్స్‌ను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బాధితులు ఏ సమయంలో స్టేషన్‌కు వచ్చినా న్యాయం అందేలా చూడాలని, ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టవద్దని చెప్పారు. డయల్ 100 ఫోన్ కాల్స్‌కు తక్షణమే స్పందించాలని, నూతన సంవత్సర వేడుకల్లో అపశ్రుతులు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ కోరుట్ల సీఐ సురేష్‌బాబు, ఎస్ఐలు శ్రీకాంత్, రాంచంద్రం ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వీణవంక, డిసెంబర్ 30: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో కరీంనగర్ నెహ్రూ యువకేంద్ర, యువచైతన్య (ఫ్రెండ్స్) యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం జాతీయ క్రీడాకారుడు కన్నారమేశ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వాలీబాల్ క్రీడలో సుమారు 15 టీమ్‌లు పాల్గొనగా, విజేతగా మల్లారెడ్డిపల్లి, ద్వితీయ స్థానంలో వీణవంక, కబడ్డీలో ప్రథమ స్థానంలో మల్లారెడ్డిపల్లి, ద్వితీయ స్థానంలో చల్లూరు నిలువగా, విజేతలకు బహుమతులు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కర్రె నాని యాదవ్, క్రీడాకారులు తిరుపతి, పెద్దులు, శంకర్, నరేశ్, కిరణ్, కుమార్, సురేశ్, ప్రశాంత్, రాము, అనిల్, గణేశ్, రాజు, మురళి, ఆయా గ్రామాల క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.